సాక్షి
వరంగల్
సోమవారం । 14 । ఆగస్టు । 2023



రైలు చక్రాల నుంచి పొగలు
సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. - 8లో▸



టీకా.. ఇదే మోకా..
పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మాత్రలు వేయించాలని పశువైద్యాధికారులు తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32^0 /25^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉండును. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కల్లు తాగిన మంత్రి ఎర్రబెల్లి



రాయపర్తి : రాయపర్తి మండలం బురహాన్‌పల్లి శివారు నానుతండాలో ఆదివారం జరిగిన ఓ వివాహానికి రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరయ్యారు. ఈ క్రమంలో తండాకు సమీపాన ఉన్న ఓ గీతకార్మికుడు కల్లు గీస్తుండగా.. గమనించిన మంత్రి వాహనం నిలిపారు. కల్లు రుచి చూడమని గీతకార్మికుడు కోరగా సేవించారు.

పాకాల వాగుపై అధికారుల సర్వే



చెన్నారావుపేట : మండలంలోని పాకాల వాగుపై బ్రిడ్జి, చెక్‌డ్యాం నిర్మాణం కోసం ఇరిగేషన్ అధికారులు ఆదివారం సర్వే చేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈఈ సురేష్ మాట్లాడుతూ వాగుపై బ్రిడ్జితో పాటు చెక్‌డ్యాం నిర్మాణం కోసం డీజీపీఎస్ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులకు రూ.18.78 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. సర్వే చేయడానికి హైదరాబాద్‌కు చెందిన సర్వే బృందం వచ్చిందని, పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుండె మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు జున్నూతుల శ్రీధర్‌రెడ్డి, రాసమల్ల సతీష్, గట్ల రాంబాబు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కందకట్ల సాంబయ్య పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

ఖానాపురం : ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు ఈనెల 31వరకు పెంచినట్లు అశోక్‌నగర్ హైస్కూల్ హెచ్‌ఎం సంకినేని మంజుల తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 14 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతిఒక్కరూ పదో తరగతి పూర్తి చదువచ్చని తెలిపారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత చదువులకు ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వివరాలకు 98490084421, 9849475093 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భిక్షపతికి డాక్టరేట్



వర్ధన్నపేట : మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన జన్ను భిక్షపతి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫిజియాలజీలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్యూస్ ఆన్ ది కాన్సెప్ట్ ఆఫ్ ఐడియల్ స్టేట్ ఎ స్టడీ' అంశంపై ప్రొఫెసర్ జి.లక్ష్మణ్ పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన భిక్షపతి ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్ను రంగమ్మ కిష్టయ్యకు డాక్టరేట్ పట్టాను అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన పరిశోధనకు సహకరించిన ప్రొఫెసర్లు వంశీధర్, కృష్ణారావు, జగన్నాథం, జి.లక్ష్మణ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. డాక్టరేట్ పొందిన భిక్షపతిని గ్రామస్తులు అభినందించారు.

కేజీబీవీల్లో 24 సీఆర్టీ, పీజీ సీఆర్టీ పోస్టుల భర్తీ



కాజీపేట సెంటర్ : జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ, పీజీ సీఆర్టీ పోస్టుల భర్తీకి ఇటీవల రాత పరీక్ష నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయించారు. జిల్లాలో 26 పోస్టులకు 72 మందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. 24 మందిని ఎంపిక చేసి పాఠశాలలకు కేటాయిస్తూ ఉత్తర్వులు అందజేశారు. గణితానికి అర్హులు, దివ్యాంగుల కోటాలో ఎవరూ లేకపోవడంతో రెండు ఖాళీలను మినహాయించారు. 24 పోస్టులను భర్తీ చేసి, నియామక ఉత్తర్వులు అందజేయడంతో అభ్యర్థులు పాఠశాలల్లో చేరినట్లు డీఈఓ వాసంతి తెలిపారు.

పేటకు మరో మణిహారం

కన్నారావుపేటకు హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ మంజూరు

- సర్వేనంబర్ 58లో ఉద్యాన పంటల పరిశోధన కేంద్రం
- హార్టికల్చర్ యూనివర్సిటీకి అనుసంధానంగా ఏర్పాటు
- జీఓ 31ని విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



కన్నారావుపేటలో ఉద్యాన పంటల పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనున్న స్థలం

నర్సంపేట: అన్నిరంగాల్లో నర్సంపేట నియోజకవర్గం సమగ్రాభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే ఎడ్యుకేషన్ హబ్, హెల్త్ హబ్, ధాన్యాగారంగా విరాజిల్లుతోంది. ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో గిరిజన సైనిక్ స్కూల్, నర్సంపేట పట్టణంలో మెడికల్ కాలేజీ, 250 పడకల జిల్లా ఆస్పత్రి, రూ.1.20 కోట్లతో టీడయాగ్నోస్టిక్ సెంటర్, ఎస్సీలకు మినీ డెయిరీ యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.336 కోట్లతో రామప్ప-పాకాల, రూ.225 కోట్లతో రామప్ప-రంగాయ చెరువు ప్రాజెక్టులను నిర్మించి గోదావరి జలాలను మళ్లించింది. ఎస్సారెస్పీ-డీబీఎం 38, 40, 48 కాల్వల ద్వారా నియోజకవర్గంలోని 46,333 ఎకరాలకు సాగునీరందిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి, సంక్షేమానికి వెచ్చిస్తున్నారు. తాజాగా నర్సంపేట నియోకవర్గంలోని నల్లబెల్లి మండలం కన్నారావుపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్



పరిశోధన కేంద్రానికి భూమిని అప్పగించేందుకు సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

(ఉద్యాన పంటల పరిశోధన కేంద్రం) మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. కన్నారావుపేట గ్రామంలోని 58 సర్వే నంబర్‌లో ఉన్న భూమిలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు కోసం జీఓ 31ని విడుదల చేసింది. గతంలో మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ.. ఒకే రకమైన పంటలపై పరిశోధన కాకుండా అన్ని పంటలకు ఉపయోగపడే విధంగా హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ మంజూరు చేయించారు. మిర్చితో పాటు పసుపు, కూరగాయలు, మామిడి, జామ, నిమ్మ, అరటి, అంగూర, ద్రాక్ష వంటి పండ్ల తోటలు, ఆయిల్‌పామ్, విత్తనాల తయారీపై పరిశోధనలు చేసే అవకాశం కలుగుతుంది.

ఉద్యాన కళాశాల సైతం మంజూరయ్యే అవకాశం..

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ములుగులోని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీకి అనుసంధానంగా నర్సంపేటలో రాష్ట్రస్థాయి హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. రీసెర్చ్ సెంటర్ ఉండడం వల్ల ఉద్యాన కళాశాల సైతం మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి. నర్సంపేటలో ఉద్యాన పరిశోధన కేంద్రం మంజూరు కావడంతో రైతులు, ప్రజలు, బీఆర్‌ఎస్ నాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జిల్లా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..



మా గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. రైతులకు అండగా నిలుస్తున్న సీఎం కేసీఆర్, ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. రైతు సమస్యలపై సంపూర్ణ అవగాహనతో పరిశోధన కేంద్రం మంజూరు కోసం కృషి చేసిన నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కృతజ్ఞతలు.

– తంగెళ్ల రవీందర్, కన్నారావుపేట

పరిశోధనలు ఉపయోగపడుతాయి..



రంగాపురం శివారులో నాకున్న నాలుగు ఎకరాల భూమిలో మిర్చి పంట సాగుచేస్తున్నా. ప్రతి ఏడాది తెగుళ్లతో పంట దెబ్బతింటుంది. శాస్త్రవేత్తలు అందుబాటులో లేకపోవడంతో దిగుబడి తగ్గి ఆర్థికంగా నష్టపోతున్నాం. కన్నారావుపేట శివారులో హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం సంతోషంగా ఉంది. శాస్త్రవేత్తల పరిశోధనలు ఉపయోగపడుతాయి. పెట్టుబడి తగ్గి దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

– ముదతనపల్లి రవీందర్, రంగాపురం

రైతులకు మేలు కలుగుతుంది..



నర్సంపేట నియోజకవర్గంలో ఉద్యాన పంటలు ఎక్కువగా ఉన్నాయి. అందుకోసమే హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ (ఉద్యాన పంటల పరిశోధన కేంద్రం)ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు జీఓ 31 విడుదల చేస్తూ మంజూరు చేసింది. పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికప్పుడు అందుతుంది. మార్కెటింగ్‌కు సంబంధించిన అంశాలు మెరుగుపడుతాయి.

– ఆర్.శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి

గాంధీ చిత్ర ప్రదర్శనకు ఏర్పాట్లు

- థియేటర్‌కు ఒక ఇన్‌చార్జ్‌ను నియమించాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ పి.ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహాత్మా గాంధీ చిత్ర ప్రదర్శనకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్ర ప్రదర్శనపై ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, వరంగల్ ఆర్డీఓ అఫ్రీన్ సిద్దిఖీ, డీపీఆర్‌ఓ పల్లవి, డీఈఓ వాసంతితో కలిసి ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. దేశ స్వాతంత్య్ర కోసం అహింసా మార్గంలో పోరాటం చేసిన జాతిపిత మహాత్మాగాంధీ జీవిత చరిత్రను తెలియజేసే చిత్రాన్ని విద్యార్థులు ఉచితంగా వీక్షించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. 14న ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని, 15న స్వాతంత్య్ర దినోత్సవం, 20న చిత్రప్రదర్శన ఉండదని తెలిపారు. 16 నుంచి 24 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని, ఇందుకు సంబంధించి థియేటర్లలో ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రతి థియేటర్‌కు ఒక ఇన్‌చార్జ్‌ను నియమించాలని డీఈఓను ఆదేశించారు. విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించి థియేటర్ల వద్దకు తీసుకెళ్లి గాంధీ సినిమా వీక్షించిన తర్వాత క్షేమంగా వారి గమ్య స్థానాలకు చేర్చేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని డీఈఓ, ఆర్టీఓకు సూచించారు. ప్రతి థియేటర్ వద్ద శానిటేషన్ నిర్వహణ సరిగా ఉండాలన్నారు. అలాగే, మెడికల్ టీంను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు ఈచిత్రాన్ని తిలకించి జాతీయ భావాన్ని చాటాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా భారత స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ప్రతి ఇంటి మీద జెండా ఎగురవేయాలని, ఇందుకోసం 90 వేల జెండాలను పంపిణీ పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను వంచించిన పాపం కేసీఆర్‌దే..

- మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఉద్యమకారుల అభిప్రాయాలను వింటున్న మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యమకారులు దగా పడ్డారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉద్యమకారులను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విస్మరించాడని, ఉద్యమ ద్రోహులను చేరదీశాడన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయనుకున్న ఉద్యమకారుల ఆశలు అడియాసలయ్యాయని అన్నారు. ఉద్యమకారులను వంచించిన పాపం కేసీఆర్‌దే అన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరగాలంటూ సమావేశంలో ఉద్యమకారులు పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఉద్యమకారుల సంక్షేమ నిధి, గుర్తింపు కార్డు, పింఛన్, ఉచిత రవాణా, పిల్లలకు ఉచిత విద్య, వైద్య సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నర్సంపేట నుంచి ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, గాదె శైలజ, మహ్మద్ రఫీ, మహ్మద్ చాంద్‌పాషా, రాజ్‌కుమార్, నల్లబెల్లి మండలం నుండి బొట్ల పవన్, రాజేశ్వర్‌రావు, లూనావత్ దేవేందర్, వేముల రాజు, మామిండ్ల ఐలయ్య, కుమారస్వామి, పెంబర్తి విష్ణు, పల్లికొండ రవి, భూక్య అచ్చు, కర్ణాకర్, ఖానాపురం నందగిరి రజనీకాంత్, కుమారస్వామి, కుసుమ శ్రీనివాస్, చంద్రశేఖర్, కృపాకర్, జాఫర్, కృష్ణ, విష్ణు, దుగ్గొండి మండలం బోనగాని రవీందర్, పరిపాటి రఘోత్తంరెడ్డి, నెక్కొండ మండలం నుంచి పరకాల భిక్షపతి, పానుగంటి వెంకటయ్య, దయ్యాల వెంకన్న, బొడ్డుపల్లి వెంకన్న, అల్లిసాబ్ పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

నల్లబెల్లి : గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణలో భాగంగా మండలంలోని మేడపల్లి, నారక్కపేట, బజ్జుతండా, కొండాయిల్‌పల్లి, లెంకాలపల్లి, ధర్మారావుపల్లి, ముచ్చింపులతండా, దస్తగిరిపల్లి, అర్వయ్యపల్లి, కన్నారావుపేట, బుచ్చిరెడ్డిపల్లి, నాగరాజుపల్లి, మూడుచెక్కలపల్లి గ్రామాలను జిల్లా పంచాయతీ అధికారి కల్పనతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. గ్రీన్ బడ్జెట్, ఇంటిపన్ను వసూళ్లు, కరెంటు బిల్లుల చెల్లింపు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో చర్చించి పలు సూచనలు చేశారు. అర్హులను క్రమబద్ధీకరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట ఫారెస్టు రేంజ్ అధికారి రమేష్, ఎంపీఓ కూచన ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న తుమ్మల కుమారస్వామి

వర్ధన్నపేట: ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్‌ఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం వర్ధన్నపేట పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్‌రంగంలో ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించే విధంగా బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప జేయాలని, అదేవిధంగా మునిసిపాలిటీ పరిధిల్లో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అందువల్ల రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మునిసిపాలిటీ పరిధిలో పనులు లేక కూలీలు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కేంద్రం స్పందించి ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో డీఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సాంబయ్య, కొండేటి సుమన్, మిధున్, సమ్మయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేట్ పరం కాకుండా చూడాలి



కార్యక్రమానికి హాజరైన పోరాట యోధులు

కాజీపేట: రైల్వే ప్రైవేట్ పరం కాకుండా ఐక్య ఉద్యమాలు చేయాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని రాజకీయ విశ్లేషకులు డి.పాపారావు అన్నారు. కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్‌లోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం దక్షిణ మధ్య రైల్వే ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విక్టరీ డే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ప్రారంభించారు. 1973లో మొదటి సమ్మె జరిగి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో నిర్వహించిన వేడుకల్లో.. నాటి ఉద్యమ స్ఫూర్తిని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ పోరాట యోధులు కేఎల్.రావు, అబ్దుల్ రహీం, జి.లింగయ్య, సి.ఎల్లయ్య, బి.రాములు, బుచ్చయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలోజు కృష్ణమూర్తి, జి.వెంకటేశ్వర్లు, గోవిందరాజులు, సుధీర్, గురుమూర్తి, ప్రభాకర్ రెడ్డి, రవీందర్, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కార్పొరేషన్' ఎదుట కాంగ్రెస్ ధర్నా

హన్మకొండ చౌరస్తా: బీఆర్‌ఎస్ సర్కారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించడాన్ని నిరసిస్తూ సోమవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ మహా ధర్నాకు ప్రజలు హాజరై బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

వరదలతో 'ఇరిగేషన్' కుదేలు

- 157 చెరువులు, కుంటలకు భారీ నష్టం
- తాత్కాలిక మరమ్మతులకు రూ.532.15 లక్షలు
- శాశ్వత నిర్మాణాలకు రూ.2724.48లక్షలు
- ప్రభుత్వానికి అధికారుల అంచనా నివేదిక



వర్షాలకు పాకాల సరస్సు ఆయకట్టు పరిధిలోని తంగుబంధం కాల్వకు గండిపడి వృథాగా పోతున్న నీరు

సాక్షిప్రతినిధి, వరంగల్/హసన్‌పర్తి: నీటిపారుదల శాఖ వరంగల్ సీఈ కార్యాలయం పరిధి(వరంగల్, మహబూబాబాద్, జనగామ)లో నష్టం భారీగా జరిగింది. ఈ మూడు సర్కిళ్లలో 157 చెరువులు, కుంటలు, కాల్వలు, చెక్‌డ్యాంలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఈమేరకు నష్ట అంచనా వేసి ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. మొత్తం తాత్కాలిక మరమ్మతులకు రూ.532.15 లక్షలు, శాశ్వత నిర్మాణాలకు రూ.2724.48 లక్షలు అవసరమని నివేదికలో పేర్కొన్నారు.

వరంగల్ సర్కిల్ పరిధిలో..

వరంగల్ నీటిపారులశాఖ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం పరిధిలోని పరకాల మండలం పైడిపల్లి, మల్లక్కపేట, పరకాల పెద్దచెరువులు, పోచారం, మాదారం నల్లచెరువు, చలివాగు, నడికుండ మండలం చౌటపల్లిలోని నల్లచెరువు చెరువు, వరికోలు చౌట చెరువు, దాసరికుంట, నల్లచెరువు, నార్లాపురం పెద్ద చెరువు, బీరెల్లి నర్సింహమాటు, ఐడీసీ స్కీం, చర్లపల్లి ఉరచెరువు, ఈదుకుంట, నడికూడ పెద్ద చెరువు, రాయపర్తి ఊరచెరువు, తిమ్మయ్యకుంట, ఆత్మకూరు పెద్ద చెరువు, శాయంపేట డీబీఎం-31, ఐనవోలు మండలం కొండపర్తి పెద్ద చెరువు, కొత్త చెరువు, ఊర చెరువు, గర్మిళ్లపల్లి మండలం కూచం చెరువు, కక్కిరాలపల్లిలోని కోమటికుంట, బంజార చెరువు, కదారి చెరువు పెరుమాండ్లగూడెంలోని పెద్ద చెరువు, పంథినిలోని నర్సింహులకుంట, గోళంచెరువు, ఐనవోలులోని కుమ్మలక్ష్మీకుంట, బొక్కల కుంట, హనుమకొండలోని భద్రకాళి ట్యాంకు, పర్వతగిరి మండలం చింతనెక్కొండ, వడ్లకొండలోని ఊర చెరువులు, సోమారంలోని జమలాపురం మాటు, వర్ధన్నపేట మండలం నల్లబెల్లిలోని ఇప్పలకుంట, కట్ర్యాలలోని కాకతీయ కెనాల్, కుమ్మరిగూడెంలోని కాకతీయ కాల్వ, దమ్మన్నపేట పెద్ద చెరువు, కమలకుంట, ఇల్లందలోని ఆంధ్రవాణికుంట, వర్ధన్నపేట చెక్‌డ్యాం, ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని మాయకుళ్లకుంట, మామునూరు నిమ్మకుంట, అల్లీపురం గుండికుంట, సంగెం మండలం షాపూర్‌లోని కాకతీయ కెనాల్, నార్లవాయిలోని అంటుకుంట, ఎల్గూరురంగంపేట పెద్ద చెరువు, వేలేరు మండలం గుండ్లసాగర్ పెద్ద చెరువు, ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల ముత్యమ్మకుంట, ఉనికిచర్ల పాయంకుంట, హసన్‌పర్తి మండలం చింతగట్టులోని బోడకుంట చెరువు, సూదన్‌పల్లి ఆచార్యకుంట, పెంబర్తిలోని ఎస్సారెస్పీ డీబీఎం-24, అన్నాసాగరం కొత్త మాటు, ముచ్చర్ల సారమ్మకుంట, నాగారం ట్యాంక్‌బండ్, కాజీపేట మండలం మడికొండలోని కొత్త కుంట, టేకులగూడెం ఊరచెరువు, అమ్మవారిపేట చక్రయ్యకుంట, దామెర మండలం ఊరుగొండ పెద్ద చెరువు, వరంగల్ మండలం మట్టెవాడ కోట చెరువులు దెబ్బతిన్నాయి.

మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో..

నర్సింహులపేట పెద్ద చెరువు, నెల్లికుదురు మండలం నర్సింహులగూడెం బంధం చెరువు, ఆలేరు పెద్దచెరువు, డోర్నకల్ మండలం చిల్కోడు మినీ ట్యాంకుబండ్, ఇనుగుర్తి మండలం చిన్నపురం పెద్ద చెరువు, కేసముద్రం మండలం కాట్రాపల్లి పెద్దచెరువు, పెనుగొండ చెక్‌డ్యాం, వెంకటగిరి చెక్‌డ్యాం, మరిపెడ మండలం నీళ్లకుర్తిలోని బాసుకుంట, పెద్ద సముద్రం, సీరోలు మండలం ఉప్పరిగూడెం భద్రయ్యకుంట, సీరోలు పెద్ద చెరువు, ఉప్పరగూడెం కంకళ్లబంధం చెరువు, కురవి మండలం నల్లెల్ల పెద్ద చెరువు, రాజోలు సోమయాజు కుంట, నారాయణపురం మొద్దులకుంట, దంతాలపల్లి మండలం పెద్దపురం, రేపూరి, వేములపల్లి, లక్ష్మీపురం, నిందన్‌పురం, నర్సింహులపేట మండలం జయపురం కౌసల్యదేవిపల్లి, కొమ్ములవంచ చెక్‌డ్యాంలు దెబ్బతిన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

జనగామ సర్కిల్ పరిధిలో...

తరిగొప్పుల మండలం అంకుషాపూర్ ఎదులకుంట చెరువుకు, జనగామ వెంకిర్యాల ఫీడర్ చానల్‌కు, బచ్చన్నపేట పరిధి బాసిరెడ్డిపల్లి అమ్మరాజుకుంట, కొడవటూరు ఊరచెరువులు, పాలకుర్తి పరిధి తొర్రూరు పెద్దచెరువు, బొమ్మెర, గూడూరు ఊరచెరువు, జఫర్‌గఢ్ పరిధి రఘునాథపల్లి శంభునికుంట, చౌటకుంట, ఉప్పుగల్ రామరాజ్‌కుంట, డొన్స చెరువు, ఫీడర్ చానల్, మల్కాపూర్, చిల్పూరు ఊర చెరువులు, చిల్పూరు ఊరకుంట, కొండాపూర్ సవర్మకుంట, శ్రీపతిపల్లిలోని మల్లారెడ్డి కుంట, కృష్ణాజీగూడెం కొత్త చెరువు, చిన్నపెండ్యాల యాదిరెడ్డికుంట, తిమ్మాపూర్ ఊర చెరువు, నష్కల్ నల్లకుంట, సముద్రాల గిద్దెకుంటలకు గండ్లు పడ్డాయి.

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇరిగేషన్ ప్రాజెక్టులు, వాటి మరమ్మతులకు అవసరమైన నిధుల అంచనా వివరాలు సర్కిళ్ల వారీగా..

		వరంగల్	మహబూబాబాద్	జనగామ
దెబ్బతిన్న నీటి వనరులు	:	64	27	66
తాత్కాలిక మరమ్మతులకు	:	రూ. 251.05 లక్షలు	రూ. 37 లక్షలు	రూ. 533.15 లక్షలు
శాశ్వత మరమ్మతులకు	:	రూ. 814 లక్షలు	రూ. 337 లక్షలు	రూ. 274.48 లక్షలు

వైద్యుల సేవలు మరువలేనివి

- మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- కేఎంసీలో పట్టాల ప్రదానోత్సవం



కమిషనర్ చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న వైద్య విద్యార్థిని

ఎంజీఎం: ×వైద్యులను ప్రజలు దేవుళ్లుగా భావిస్తున్నారు. కరోనా సమయంలో వైద్యుల సేవలు మరువలేనివి¤ అని మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఆదివారం రాత్రి కాకతీయ మెడికల్ కళాశాలలో 2017 బ్యాచ్‌కు చెందిన వైద్యవిద్యార్థుల 59వ పట్టాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్య అతిథిగా కమిషనర్ హాజరై మాట్లాడుతూ వైద్య వృత్తిలో విలువలు కాపాడుతూ మానవతా దృక్పథంతో ప్రజలకు సేవలందించాలన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ మాట్లాడుతూ కేఎంసీలో చదివిన ఎంతో మంది విద్యార్థులు మంచి పేరు సాధించుకున్నారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, రజామ్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాటిల్ మీదపడడంతో విద్యార్థికి గాయం


తలపై సీసా పడడంతో కారుతున్న రక్తం

శాయంపేట : హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థికి గాయమైంది. ఈ ఘటన ఆదివారం జరిగింది. పాఠశాల డార్మెటరీ నుంచి మణికంఠ అనే విద్యార్థి బాదంపాలు తాగి సీసాను వదిలివేయడంతో కింద కూర్చున్న విద్యార్థి జస్వంత్‌పై పడి తలకు గాయమైంది. దీంతో అతడికి రక్తస్రావం కావడంతో ప్రథమ చికిత్స చేయడానికి జీఎన్ఎం సరిత లేకపోవడంతో ఉపాధ్యాయులు కారులో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ట్రాక్టర్, బైక్ ఢీ
● మరొకరికి..


తీవ్రంగా గాయపడిన అక్షయ్

సంగెం : ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటన ఆదివారం మండలంలోని షాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన కాసం రాజు పొలంలో దమ్ము చేసి ట్రాక్టర్ రోటోవేటర్‌తో ఇంటికి వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజేష్ తన నానమ్మ లక్ష్మి, బావ కొయ్యల అక్షయ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఇల్లందకు వెళ్తున్నారు. ఈ క్రమంలో షాపూర్ లోహిత గ్రామాల మధ్యలో పొలాల నుంచి బీటీ రోడ్డుపైకి ట్రాక్టర్ ఎక్కింది. అదే సమయంలో బైక్ రోటోవేటర్‌కు ఢీకొంది. ఈ ఘటనలో అక్షయ్‌కు తీవ్రంగా, లక్ష్మి, రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108లో క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించినట్లు ఈఎంటీ జె.కుమార్, పైలట్ ఎ.కుమారస్వామి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండలంలోని బోర్లగూడెంలో జరిగింది. మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నీలం మణికంఠ తన ద్విచక్రవాహనంపై కాటారం నుంచి నర్సింగాపూర్ వెళ్తున్నాడు.ఈ క్రమంలో మార్గమధ్యలోని బోర్లగూడెం హనుమాన్ దేవాలయం సమీపంలో బైక్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో కిందపడిన మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు.

టీకా.. ఇదే మోకా..

● పశువులను రక్షించుకుందాం..
● విస్తరించనున్న గాలికుంటు వ్యాధి
● నివారణకు గ్రామాల్లో టీకాలు
● రైతులు వినియోగించుకోవాలి


బాలకృష్ణ, జిల్లా పశువైద్యాధికారి

చెన్నారావుపేట: పశువులకు వచ్చే వ్యాధుల్లో చాలా వరకు ప్రమాదకరమైంది.. వాటిలో సత్తువ లేకుండా చేసేది వ్యాధి గాలికుంటు. ఇది ఒకసారి వస్తే ఆ పశువు పని చేయడం అసాధ్యం. అందుకే రైతులు తమ పశువులకు ఆ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తతో టీకా వేయించాలి. అప్పుడే పశువులు ఆరోగ్యకరంగా ఉంటాయి. కాగా, జిల్లాలో గోజాతి పశువులు 90,452, గేదె జాతి పశువులు 1,21,489 వరకు ఉన్నాయి. వీటన్నింటికీ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి బాలకృష్ణ వెల్లడించారు.

గాలికుంటు వ్యాధి సోకే సందర్భం..

చీలిక గిట్టలున్న పశువులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. ఈ వ్యాధి సూక్ష్మమైన అఫ్తో వైరస్ వలన గాలి, ఇతర మార్గాల ద్వారా అతివేగంగా పశువులకు వ్యాపిస్తుంది. తద్వారా మరణాల శాతం లేకపోయినా పశువుల్లో ఉత్పాదక శక్తి తగ్గి తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన దూడలు మృత్యువాత పడుతాయి. ఈ వ్యాధి యుక్త వయస్సులో ఉన్న పశువులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న పశువులు, సంకరజాతి పశువుల్లో ఎక్కువగా సోకుతుంది.


నోటిలో పుండు కావడంతో సొంగ కారుస్తున్న పశువు

వ్యాధి వ్యాప్తి ఇలా..

సాధారణంగా వ్యాధి సోకిన పశువులు.. ఆరోగ్యవంతమైన పశువులకు దగ్గరకు ఉండటం వలన వ్యాధి వ్యాప్తికి కారణమవుతాయి. అంతేకాకుండా వ్యాధి సోకిన పశువుల నుంచి విడుదలయ్యే అంతస్రావాలు, విసర్జక స్రావాల్లో వైరస్ ఉండి వ్యాధికి గురవుతాయి. అలాగే వ్యాధి లక్షణాలు కనబడే 4 రోజుల ముందు వరకు పాలు, వీర్యంలో కూడా వైరస్ ఉంటుంది. పాల ద్వారా దూడలకు, పాల ట్యాంకుల ద్వారా వేరే పశుశాలలకు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. అలాగే, వ్యాధి సోకిన పశువులు తిన్న గడ్డి ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి కలిగించే వైరస్‌లు ఎండిపోయిన పేడలో 14 రోజులు, చలికాలంలో పేడలో 6 నెలలు, మూత్రంలో 39 రోజులు, మట్టిలో ఎండాకాలంలో 3 రోజులు, చలికాలంలో 28 రోజులు బతుకుతాయి.

చికిత్స..

ఈ వ్యాధి సోకిన పశువులను వేరు చేసి సత్వర చికిత్స చేయించాలి. వైరస్‌కు మందులు పనిచేయవు. అందుకే వ్యాధి లక్షణాలకు అనుకుగుణంగా చికిత్స చేయాలి. నోటిలోని పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ నీళ్లలో శుభ్రం చేసి వాటికి బోరోగ్లిజరిన్ యాంటి సెప్టిక్ ఆయింట్‌మెంట్‌ను పూయాలి. అలాగే కాలిపుండ్లను జింక్ ఆక్సైడ్‌లో రాక్సిన్, హిమాక్స్ వంటి ఆయింట్‌మెంట్ పూయాలి. ఈగలు వాలకుండా వేప నూనె, లినమెంట్ వంటి పదార్థాలను వినియోగించాలి.

వ్యాధి లక్షణాలు..

వ్యాధి లక్షణాలు జీవాల కన్నా పశువుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల పారన్ హీట్, 106 డిగ్రీల పారన్‌హీట్ ఉంటుంది. నోటిలో చర్మపు పొరలు, పళ్ల చిగుళ్ల నాలుక, తోకవద్ద లోపలి ప్రాంతంలో బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల్లో చితికిపోవడం వల్ల, పశువులు నొప్పితో మేత తినవు, నోటి నుంచి విపరీతంగా నురగకారుస్తూ, ఒగిరిస్తూ ఉంటాయి. గిట్టల మధ్య, గిట్టలపై వలయంగా ఉండే ప్రాంతంలో బొబ్బలు ఏర్పడి, చితికి నొప్పివల్ల కుంటుతాయి. అలాగే పాలిచ్చే పశువుల చనుమొనలపై కూడా బొబ్బలు ఏర్పడి పొదుగు వాపు వస్తుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన దూడలు మృత్యువాత పడుతాయి. దుక్కికి ఉపయోగించే పశువులు పని చేయాలేవు.

నివారణకు ఈ నెలలో టీకాలు..

జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో గాలికుంటు నివారణ టీకాలు అందుబాటులో ఉంచామని జిల్లా పశువైద్యాధికారి బాలకృష్ణ వెల్లడించారు. ఈ నెలలో ప్రతి గ్రామంలో టీకాలు ఉచితంగా వేస్తామన్నారు. రైతుల ఈ వ్యాధి నుంచి తమ పశువులను రక్షించుకోవడానికి టీకాలు వేయించాలన్నారు.

రైలు చక్రాల నుంచి పొగలు

● ఘన్‌పూర్‌లో 15 నిమిషాలు ఆగిన ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్


రైలు చక్రాల నుంచి వస్తున్న పొగ


రైలు చక్రాల బ్రేక్ లైనర్లు పట్టేసిన దృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురైన సంఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ హోమ్ సిగ్నల్ వద్దకు ఉదయం 10 గంటల సమయానికి చేరుకుంది. అయితే ఒక్కసారిగా రైలు చక్రాలకు సంబంధించిన బ్రేక్ లైనర్లు పట్టేయడంతో రైలు ఆగిపోయింది. చక్రాల నుంచి పొగలు రావడాన్ని గమనించిన రైలు డ్రైవర్, సిబ్బంది వెంటనే అప్రమత్తమై బ్రేక్ లైనర్లను సరిచేసి సమస్యను పరిష్కరించారు. బ్రేక్ లైనర్ల నుంచి పొగలు వచ్చాయని, ఎలాంటి ప్రమాదం లేదని నిర్ధారించి రైలును పంపించారు. దాదాపు పదిహేను నిమిషాల పాటు ఘన్‌పూర్‌లో రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. ఇలాంటి సంఘటనలు సహజంగా జరుగుతుంటాయని, ఎలాంటి ప్రమాదం లేదని స్టేషన్‌మాస్టర్ మల్లికార్జున్ తెలిపారు.

కాజీపేట జంక్షన్‌లో తనిఖీ

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ఆదివారం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను క్యారియజ్ అండ్ వ్యాగన్ మెకానిక్స్ తనిఖీ చేశారు. సికింద్రాబాద్–గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ఘన్‌పూర్ వద్ద బ్రేకులు పట్టుకొని పొగలు వచ్చాయి.. దీంతో కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నాక కొద్ది సేపు నిలిపి మెకానిక్ సిబ్బంది బ్రేకులు పట్టుకున్న ఎల్‌హెచ్‌బీ కోచ్‌ని, బ్రేక్ ప్యాడ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి గుంటూరుకు పంపించారు. ఫైబర్ బ్రేక్‌లు కావడంతో అప్పుడప్పుడు బ్రేక్ ప్యాడ్స్ పట్టుకొని పొగలు వస్తాయని, దీని వల్ల ఎలాంటి ప్రమాదం లేదని రైల్వే అధికారులు తెలిపారు.

పొగలు ఎందుకు వస్తాయంటే..

రైలు చక్రాలకు పొగలు అప్పుడప్పుడు వస్తాయని దీనితో పెద్ద ప్రమాదం ఏమి లేదని రైల్వే ఇంజినీరింగ్ అధికారులు అంటున్నారు. రైలు స్టార్ట్ అయిన తర్వాత అక్కడక్కడా సిగ్నల్స్ వద్ద ఆగి తిరిగి స్టార్ట్ అవుతుంది. ఈ క్రమంలో స్పీడ్ పికప్‌లో బ్రేక్‌లు పట్టుకొని త్వరగా రిలీజ్ కాకపోవడం వల్ల బ్రేక్ ప్యాడ్స్ హార్డ్‌గా మారి బలవంతంగా రిలీజ్ అవుతున్న క్రమంలో ఈ పొగలతో పాటు ఒక్కొక్కసారి మంటలు కూడా వస్తాయని తెలిపారు. ఘన్‌పూర్‌లో జరిగిన ఇంటర్‌సిటీ విషయంలో కూడా వీల్స్ బ్రేక్‌లు రిలీజ్ సమయంలో పొగలు వ్యాపించాయని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

బ్యాంకు డిప్యూటీ మేనేజర్‌పై కేసు

నర్సంపేట రూరల్ : బ్యాంకు నిధులు దారి మళ్లించి మోసం చేసిన డిప్యూటీ మేనేజర్‌పై కేసు నమోదు చేసినట్లు నర్సంపేట టౌన్ సీఐ సుంకరి రవికుమార్ తెలిపారు. పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకులో బైరిశెట్టి కార్తీక్ ఐదు సంవత్సరాల నుంచి డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన గోల్డ్ లోన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు. కాగా, ఖాతాదారులు లోన్ కోసం గోల్డ్‌ను తనఖా పెట్టి డబ్బు తీసుకుంటారు. తమ అవసరాలు తీరిన తర్వాత మళ్లీ బ్యాంకులో జమ చేసి తన గోల్డ్‌ను తీసుకెళ్తారు. ఈక్రమంలో ఖాతాదారుల నుంచి డబ్బు తీసుకుని లోన్‌లో జమ చేయకుండా తన సొంతానికి వినియోగించుకుంటున్నాడు. ఖాతాదారులకు మాత్రం గోల్డ్ ఇవ్వడంతో ఎవరికీ అనుమానం కలుగలేదు. ఇటీవల ఉన్నతాధికారులు ఆడిట్ నిర్వహించడంతో 128 ఖాతాలకు సంబంధించి సుమారు రూ. 8.5కోట్లు వినియోగించుకున్నట్లు తేలడంతో ఐసీఐసీఐ బ్యాంక్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో కార్తీక్‌పై కేసు నమోదుచేసినట్లు టౌన్ సీఐ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో రెండు కార్లు ఢీకొనగా కాలినడకన వస్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటనలో ఒకరిపైన కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు ఏఎస్సై రాజేశం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కాళేశ్వరం బస్టాండ్ నుంచి గోదావరికి వస్తున్న ఓకారు అతి వేగంగా వచ్చి మరో కారును ఢీకొట్టింది. దీంతో పక్కనే కాలినడకన వస్తున్న చింతల రాజయ్య, రమలకు కాళ్లకు, నడుముకు గాయాలయ్యాయి. ముందు ఉన్న గోపాల్‌రావు ఆల్టోకారు వెనుక భాగం నుజ్జయింది. దీంతో కారు అతి వేగంగా వచ్చిన కారుడ్రైవర్ రాయభారపు దీపక్ పైన బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయినట్లు ఏఎస్సై తెలిపారు.

బొమ్మ గీసి అమ్ముకుంటున్నారు!


గ్రామ పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

బొమ్మ గీసి.. ప్లాట్లని చెప్పి అమ్ముకుంటున్నారు. కాగితాల్లో హద్దులు చూపి కరెన్సీ కట్టలు వెనకేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులకు తాయిలాలిచ్చి.. కోట్లు కూడగట్టుకుంటున్నారు. గూడు కలను నిజం చేసుకోవాలనుకునే మధ్యతరగతి ప్రజలను హద్దులు చూపకుండా బురిడీ కొట్టిస్తున్నారు. నిబంధనలేవీ పాటించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. జోరుగా సాగుతున్న నయా 'రియల్' దందాపై కథనం.

– ఎల్కతుర్తి


తెల్ల కాగితంలో గీసిన ప్లాట్ల మ్యాప్

● మ్యాప్‌లు చూపి ప్లాట్ల విక్రయం
● ఎకరాల్లో కొని.. గజాల్లో అమ్మకం
● వెంచర్ చేయకుండానే వ్యాపారం
● కోట్లల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి
● రెవెన్యూ అధికారుల అండ.. ఆగని రిజిస్ట్రేషన్లు

రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొత్త తరహా దందాకు తెరలేపారు. వెంచర్ ఏర్పాటు చేయకుండానే ప్లాట్ కొనుగోలు దారులకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. కేవలం కాగితాల్లో మ్యాప్‌లు చూపించి ప్లాట్ల విక్రయాలు సాగిస్తున్నారు. వెంచర్ అనుమతులకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్సులు ఎగ్గొడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండి కొడుతున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో ఎల్కతుర్తి మండలం పెంచికలపేట శివారులో వీరి రియల్ దందా మూడు పూలు ఆరుకాయలుగా కొనసాగుతోంది. ఎల్కతుర్తి మండలం పూర్తిగా కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో ఉంది. దీంతో హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారి ఎన్‌హెచ్–563కి ఇరుపక్కలా వ్యవసాయ భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఎకరానికి రూ.2 కోట్లకు పైగా ధర పలుకుతోంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కళ్లు ఈప్రాంతంపై పడ్డాయి. నిబంధనల మేరకు వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ చేసి ప్రభుత్వ అనుమతులతో వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించాలి. కానీ.. ఇందుకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు పొందకుండా.. కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని కాగితాల్లో మ్యాపులు వేయించి హద్దులు ఏర్పాటు చేయకుండానే రెవెన్యూ అధికారుల అండదండలతో గజాల లెక్కన ప్లాట్లను విక్రయిస్తున్నారు.

అధికారుల అండదండలు

పెంచికలపేట గ్రామ శివారు హనుమకొండ–కరీంనగర్ ఎన్‌హెచ్–563కి ఆనుకుని ఉన్న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి సర్వేనంబర్ 49.50లో 3.18 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి చుట్టూ హద్దులు ఏర్పాటు చేశాడు. వెంచర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం, గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదు. కొనుగోలు చేసిన భూమిలో 240 గజాల చొప్పున 33 ప్లాట్లుగా మ్యాప్ తయారు చేసి దాని ఆధారంగా విక్రయాలు సాగిస్తున్నాడు. కొనుగోలుదారులను బురిడీ కొట్టించి గజానికి రూ.15వేల చొప్పున ప్లాట్లు విక్రయిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా ఇందులో కొన్ని ప్లాట్లు ఇప్పటికే రిజిస్ట్రేషన్‌తో పాటు నాలా కన్వర్షన్ సైతం అయ్యాయి. కనీసం తమ ప్లాటు ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్లాట్లు కొన్న పలువురు వ్యక్తులు వాపోతున్నారు.

హెచ్చరికలు బేఖాతరు

వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ చేయించకుండా ఎలాంటి ప్లాట్లు విక్రయించవద్దని, ఆ ప్లాట్లలో ఎలాంటి కట్టడాలు చేపట్టినా గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని ఇటీవలే పెంచికలపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి హెచ్చరికల బోర్డును ఏర్పాటు చేశారు. కానీ.. హెచ్చరికల బోర్డు ఎవరి కంటా పడకుండా ఉండేందుకు ఆబోర్డును రియల్ ఎస్టేట్ వ్యాపారి తొలగించి యథావిధిగా దందా సాగిస్తున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న రియల్ వ్యాపారిపై, వారికి సహకరిస్తున్న అధికారులపై చట్టరీత్యా చర్యలు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పాకాల వాగులో మొసలి..

● భయాందోళనలో రైతులు

గూడూరు: మండల కేంద్రానికి సమీపంలోని పాకాల వాగు నీటిలో ఆదివారం రైతులకు మొసలి కనిపించింది. వెంటనే ఈ విషయాన్ని వారు తమకు తెలిసిన ఓ ఫొటోగ్రాఫర్‌కు సమాచారం అందించడంతో అతను వీడియోలో బంధించాడు. గూడూరు నుంచి నెక్కొండ, కేసముద్రం మండలాలకు వెళ్లే ప్రధాన రహదారిపై పాకాల వాగు బ్రిడ్జికి సమీపంలో పెద్దమర్రి ఉంది. వాగుకు రెండు వైపులా పంటపొలాలు సాగవుతున్నాయి. నిత్యం రైతులు దుక్కులు దున్నిన తరువాత పశువులను వాగు నీటితో శుభ్రం చేస్తారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు వాగు పొంగిన విషయం తెలిసిందే. ఆ నీటిలో కొట్టుకు వచ్చిన మొసలి గూడూరు సమీపంలోని నీటి గుంతలలో సంచరిస్తోంది. రెండు మూడు రోజులుగా పెద్దమర్రి ప్రాంతంలో నీరు తాగడానికి వెళ్లిన గేదెలు, పశువులను చంపడానికి యత్నించగా అవి బెదిరి బయటికి వచ్చాయి. ఈ ఘటనను చూసిన ఓ రైతు మొసలిగా గుర్తించాడు. ఎవరూ నీటిలో దిగొద్దని సహచర రైతులకు తెలిపారు.


నీటిలో కనిపిస్తున్న మొసలి

గోదావరిలో మునిగి మహారాష్ట్ర వాసుల మృతి

కాళేశ్వరం: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా చింతలపల్లి అంతర్రాష్ట్ర వంతెన దిగువన గోదావరిలో స్నానాలు చేసేందుకు వచ్చి నీటమునిగి ఒక యువకుడు, బాలుడు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి బంధువుల ఇంటికి హిమాన్ష్(22) శనివారం సిరొంచ తాలూకా అంకీస గ్రామానికి వచ్చాడు. బంధువు మాడిశెట్టి సుమంత్(14) అనే బాలుడు మరో ముగ్గురు కలిసి జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరాలయానికి వెళ్లేందుకు ముందుగా మహారాష్ట్ర వైపు వంతెన దిగువన గోదావరిలో స్నానానికి దిగారు. లోతు ప్రవాహంలోకి హిమాన్ష్, సుమంత్‌తో పాటు మరో యువకుడు కొట్టుకుపోయాడు. యువకుడు అతి కష్టం మీద ఒడ్డుకు చేరగా.. మిగతా ఇద్దరు నీటిలో మునిగి గల్లంతయ్యారు. బయట ఉన్న మరో ఇద్దరు యువకులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. పోలీసులకు విషయం చేరవేయగా.. ఎస్‌డీఆర్ఎఫ్ టీంలు బోటు సాయంతో వెతికి మృతదేహాలను వెలికితీశారు. అనంతరం కాళేశ్వరం వైపు తీరానికి తీసుకొచ్చి అంబులెన్స్‌లో సిరొంచ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సంఘటన స్థలాన్ని సిరొంచ ఎస్సైలు కిషన్ కందే, దినేష్ కోడి, పోలీసులు పరిశీలించారు.

బావిలో పడి వ్యక్తి..

రాయపర్తి: బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని ఎర్రకుంటతండా గ్రామంలో జరిగింది. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన భూక్య అమర్‌సింగ్(50) మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించిన అనంతరం మైకంలో పరిసర గ్రామాల్లో సంచరిస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చింది. బావిలో చూడగా అమర్‌సింగ్ మృతదేహం కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


యువకుడు, బాలుడి మృతదేహాలు

తల్లిదండ్రులకు భారం అవుతున్నానని..

● యువకుడి ఆత్మహత్య


శివాజీ (ఫైల్)

టేకుమట్ల: తల్లిదండ్రులకు భారం అవుతున్నాననే మనస్తాపంతో ఓ యువకుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన బొమ్మ శివాజీ(24) బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసి కొంత కాలం ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసి, పోటీ పరీక్షలకు సిద్ధ అవుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల రాసిన పరీక్షల్లో ఉద్యోగం రాకపోవడంతో అమ్మానాన్నలకు భారంగా మారుతున్నానని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి తన సోదరుడికి సెల్ ఫోన్‌లో అమ్మానాన్నలను బాగా చూసుకో.. నేను ఆత్మహత్య చేసుకుంటున్నానని మెసేజ్ చేసి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా స్థానికులు బావి నుండి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.

నర్సంపేట మరో యువకుడు..


మహేష్ (ఫైల్)

నర్సంపేట రూరల్ : మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటన నర్సంపేట పట్టణంలో జరిగింది. ఎస్సై రాజు కథనం ప్రకారం ఖానాపురం మండలం కొత్తూరుకు చెందిన రెడ్డిమల్ల మహేష్ (28)కు దుగ్గొండి మండల మైసంపల్లి గ్రామానికి చెందిన మేఘనతో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మహేష్.. పట్టణంలోని శివాజీ రోడ్డులో అద్దెకు ఉంటూ కూలి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ దంపతులకు 12 రోజుల క్రితమే పాప జన్మించింది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మైసంపల్లిలో ఉన్న భార్య వద్దకు వెళ్లాడు. అక్కడ ఆమెతో గొడవ జరిగింది. శనివారం రూమ్‌కు వచ్చిన మహేష్ మనస్తాపం చెంది సాయంత్రం పురుగుల ముందు సేవించాడు. వెంటనే స్థానికులు గమనించి 108లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం


లక్ష్మి(ఫైల్)

డోర్నకల్: పట్టణంలోని సుభాష్ వీధికి చెందిన ఓ మహిళ శుక్రవారం ఉదయం నుంచి కనిపించడం లేదు. వీధికి చెందిన లింగంపల్లి లక్ష్మి(55) ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం లక్ష్మి భర్త వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. లక్ష్మి ఆచూకీ తెలిసిన వారు 9490231501, 8328476066, 8985676002 నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.

పాముకాటుతో విద్యార్థిని మృతి

● కొత్తూరు(సీ)లో ఘటన


షఫీనా(ఫైల్)

కురవి: పాముకాటుతో ఓ విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఆర్ఎంపీ షేక్ యాకూబ్ కుమార్తె నర్సింగ్ విద్యార్థిని షఫీనా(22) శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తోంది. ఈ సమయంలో పాము కాటు వేసింది. దీంతో షఫీనా లేచి తండ్రి యాకూబ్‌తో ఏదో కుట్టిందని చెప్పింది. ఇంతలోనే షఫీనాకు వాంతులు అవుతుండగా యాకూబ్ వెంటనే మహబూబాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్ గ్రామానికి చేరుకుని షఫీనా మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొండపల్లి శ్రీదేవి, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి బజ్జూరి పిచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తోటలాలయ్య, సర్పంచ్ యానాల గంగాధర్‌రెడ్డి, నాయకులు రవి, భిక్షమయ్య, సత్యనారాయణ, సైదులు, రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

రేఖ్య తండాలో వ్యక్తి..


శ్రీను (ఫైల్)

దంతాలపల్లి: పాముకాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని తూర్పుతండా జీపీ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తూర్పుతండా జీపీ పరిధిలోని రేఖ్య తండాకు చెందిన బానోత్ శ్రీను(35) శనివారం పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. శ్రీను భార్య జ్యోతి ఉతికిన దుస్తులను బెడ్డుపై వేసింది. ఈ క్రమంలో భోజనం చేసిన అనంతరం శ్రీను మంచంపై ఉన్న బట్టలలో ఉన్న పామును గమనించకుండా నిద్రించాడు. రాత్రి 11 గంటల సమయంలో పాము.. శ్రీనును కరిసింది. దీంతో మేల్కొన్న శ్రీను తనను ఏదో కరిసిందని బట్టలు తీసి చూడగా అందులో పాము ఉండడం గమనించాడు. పామును వెంటనే కర్రతో చంపాడు. విషయం తండావాసులకు తెలుపగా వెంటనే తొర్రూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో కుటుంబంతోపాటు తండాలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.